సాక్షి
జోగుళాంబ గద్వాల

బుధవారం । 13 । నవంబర్ । 2024



రసవత్తరంగా..
లింగాలలో 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸



కురుమూర్తి గిరుల కిటకిట
వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులతో కురుమూర్తిగిరులు రద్దీగా మారాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.7 /18.8

వాతావరణం
ఉదయం చలి ఉంటుంది. కొద్దిమేర ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పాడి సంపదతో ఆర్థికాభివృద్ధి



గట్టు: పశు సంపద తోడుంటే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, రైతులు పశు సంపదపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం చాగదోనలో భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ఫౌండేషన్ సహకారంతో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధి, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే పశు సంపదను కూడా పెంచాలని అన్నారు. పాడి పశువులకు సరైన పోషణ, పోషకాహారం, బలమైన దినుసులతో ధాన్యాన్ని తయారు చేసి అందించాలని అన్నారు. చూడి పశువులకు తప్పనిసరిగా గాలికుంటూ వ్యాధి నిరోధక టీకాలను వేయించాలన్నారు. గాలికుంటూ వ్యాధి వలన పశువుల నోటిలో, కాలిగిట్టల్లో పుండ్లు, నోటిలో జొల్లు, చొంగ కారడం, మేత తినకుండా ఉండడం వలన పశువులు బలహీనంగా మారుతాయన్నారు. ఈ శిబిరంలో 21 పశువులకు గర్భకోశ పరీక్షలు, 333 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామన్నారు. గడ్డి విత్తనాలను రాయితీపై ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు శంకరయ్య, వరలక్ష్మీ, ప్రియాంక, తెలంగాణ పేదరక నిర్మూలన అధికారులు వెంకటేశ్వర్లు, మునిస్వామి, హరికృష్ణ పాల్గొన్నారు.

డీఈఓగా ప్రవీణ్‌కుమార్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల జిల్లాల డీఈఓగా ప్రవీణ్ కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత డీఈఓ రవీందర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో పోస్టు ఖాళీ ఏర్పడింది. దీంతో వికారాబాద్ జిల్లా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌ను డీఈఓగా నియమించింది.

కోర్టు సేవలు వినియోగించుకోవాలి

అలంపూర్: కోర్టు సేవలు వినియోగించుకోవాలి న్యాయవాది మిథున్ తేజ అన్నారు. అలంపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం న్యాయ సేవల దినోత్సవం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు. అన్యాయం జరిగిన ప్రతి ఒక్కరికి న్యాయం చేసేందుకు కోర్టులు ఉన్నాయన్నారు. న్యాయ సేవలు పొందడంలో అందరూ సమానమే అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా న్యాయవాదులు తిమ్మారెడ్డి, నారాయణ రెడ్డి, నాగరాజు, ఆంజనేయులు, గజేందర్, కక్షిదారులు పాల్గొన్నారు.

ఆశల వల.. ఆస్తులు గుల్ల

పేకాట, ఆన్‌లైన్ జూదం మాయలో ఆస్తులు అమ్ముకుంటున్న వైనం

- జిల్లా నుంచి వందలాదిగా గోవాకు వెళ్లి పేకాట
- వారిని తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా బ్యాచ్‌లు
- వాహనాలు తాకట్టు పెట్టి అధిక వడ్డీలకు అప్పులు



రాజోళి: జిల్లాలో పేకాట, ఆన్‌లైన్ జూదానికి అలవాటు పడుతున్న వారి సంఖ్య పెరిగిపోతుంది. సులువుగా డబ్బు సంపాదించుకునేందుకు అలవాటు పడ్డ యువతతో పాటు, ఐదు పదులు వయసు దాటిన వారు, రిటైర్డ్ ఉద్యోగులు పేకాటకు బానిసలవుతున్నారు. జిల్లాలో పోలీసుల నిఘా ఉండడంతో లైసెన్సు ఉన్న గోవా తదితర ప్రాంతాలకు వెళ్లి మరీ పేకాట ఆడి రూ.లక్షలు పోగొట్టుకొని ఆ తర్వాత లబోదిబోమంటున్నారు. జిల్లా కేంద్రం మొదలుకుని అయిజ, శాంతిగనర్, మానవపాడు, ఉండవెల్లి, ఎర్రవల్లి తదితర మండలాలతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి పేకాటకు బానిసవుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఏజెంట్లు..

మద్యంకు అలవాటు పడిన యువకులు, ఏ పని చేయలేక, సులువుగా డబ్బు సంపాదించుకునేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నారు. పేకాట బలహీనత ఉన్నవారిని, మార్కెట్‌లో మంచి పేరున్న వారిని ఎంచుకుని, వారిని టార్గెట్ చేసి గోవాకు తీసుకెళ్తున్నారు. అక్కడ జరిగినదంతా బయటకు చెప్పలేక మార్కెట్‌లో తమకున్న పేరును చెడగొట్టుకోవడం ఇష్టం లేక చాలా మంది బాధితులు మౌనంగా ఉంటున్నారు. శాంతిగనర్‌లో బంగారు దుకాణం నడిపే ఒక పెద్ద వ్యాపారి కూడా ఈ మత్తులో దిగడంతో పాటు, ప్రతి 15 రోజులకొకసారి ఇక్కడి నుంచి కొందరిని గోవాకు తీసుకెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఆయన పేకాట ఆడటంతో పాటు,అధిక వడ్డీలకు డబ్బులు ఇవ్వడంతో శాంతిగనర్, రాజోళి నుండి కొందరు ఆయన వెంట వెళ్లి పేకాట ఆడుతున్నట్లు, ఆయనతో పాటు అయిజ, గద్వాలలో పేరు మోసిన కొందరు టూర్ పేరుతో క్యాసినోకు తీసుకెళ్లి రూ.లక్షలు పోగొట్టుకునేందుకు కారకులై, వారు మాత్రం రూ.లక్షల్లో కమీషన్లు తెచ్చుకుంటున్నారు. కమీషన్ ఏజెంట్ల గారెడీలో పడి మోసపోతున్నామని పలువురు బాధితులు వాపోయారు. తమలా మరెవరూ ఈ ఉచ్చులో పడొద్దని ఆవేదన వ్యక్తం చేశారు.

గద్వాల టు గోవా..

పేకాటకు అలవాటు పడిన వారిలో చాలా మంది నిరక్షరాస్యులు కూడా ఉన్నారు. వారు సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పొలాల వద్ద, సుబాబుల్ తోటల్లో పేకాట ఆడేవారు. పోలీసుల దాడులు పెరగడంతో పేకాటను వదులుకోలేక అనుమతి ఉన్న గోవాకు సైతం వెళ్తున్నారు. కానీ చదువు లేకపోవడంతో అక్కడకు వెళ్లి ఇబ్బందులు పడటం ఇష్టం లేని వారు చాలా మంది ఉన్నారు. ఇలాంటి వారిని బుట్టలో వేసుకునేందుకే గోవాలో తెలిసిన కొందరు జిల్లా బ్యాచ్ వీరికి గోవా మత్తును అలవాటు చేస్తున్నారు. గోవాలో క్యాసినోకు అనుమతి ఉండటంతో అక్కడున్న కొందరితో ఈ ఏజెంట్లు కమీషన్ మాట్లాడుకొని ఇక్కడి నుంచి తీసుకెళ్లే ప్రతి ఒక్కరిపైనా డబ్బులు వసూలు చేస్తున్నారు. దీంతో వీరి తెలివినంతా చదువురాని వారిపై పేకాటకు అలవాటైన వారిపై ఉపయోగిస్తున్నారు. గోవాకు వెళితే కేసులు ఉండవని, అందులోకి వెళ్లడానికి కొంత నగదును చెల్లిస్తే విలాసవంతమైన ఏర్పాట్లు ఉంటాయని చెప్పి అలవాటు చేస్తారు. అక్కడకు వెళ్లిన వారు కూడా వాటిని చూశాక దానికి అలవాటు పడిపోతారు. రూ.వేలల్లో మొదలై రూ.లక్షల వరకు పేకాటలో పందెం కాస్తున్నారు. వీరు ఎంత నగదు పెట్టి ఆడితే, ఏజెంట్లకు అంత కమీషన్ పెరుగుతుంది. ఆడేవారి దగ్గర డబ్బులు అయిపోతే, అక్కడే వారికి అధిక వడ్డీలకు డబ్బులను ఇప్పించడం లేదా వారే ఇవ్వడం అందుకు వారి వాహనాలు, ఖరీదైన కార్లు, బంగారం లాంటి వస్తువులు తాకట్టు పెట్టుకుని డబ్బును ఇవ్వడం చేస్తారు. గోవాలో ఉండి ఇక్కడ ఉన్న తమ వారికి ఫోన్ చేసి,డబ్బు అవసరమైన వారి ఇంటికి పంపించి అక్కడ వాహనాలను, వస్తువులను స్వాధీనం చేసుకుని, గోవాలోనే చేతికి నగదు అందజేస్తున్నారు. మద్యం మత్తులో విచ్చలవిడిగా జూదమాడి, నష్టపోయి తిరిగి ఇంటికి వచ్చాక కాని వారు పోగొట్టుకున్నదేంటో బాధితులకు అర్థం కాదు.

జిల్లాలో కొన్ని ఘటనలు ఇలా..

- **వడ్డేపల్లి మున్సిపాలిటీకి చెందిన ఒక హోటల్ వ్యాపారి ప్రతిరోజు రూ.వేలల్లో సంపాదించేవాడు. కొందరు గోవాకు తీసుకెళ్లి పేకాట ఆడించడంతో ఒకట్రెండు సార్లు అదృష్టం కలిసి వచ్చింది. ఆ తర్వాతి కాలంలో ఉన్నది పోయి, అప్పులు చేసి, వ్యాపారం కాస్తా దివాలా తీసే పరిస్థితికి వచ్చింది.**
- **నెల రోజుల క్రితం అయిజ, శాంతినగర్‌కి చెందిన యువకులు మిత్రులతో కలిసి పేకాటపై మోజుతో గోవాకు వెళ్లారు. లక్షల** రూపాయలు పోగొట్టుకుని తిరిగి వచ్చారు.
- **10 రోజుల క్రితం అయిజలో బెట్టింగ్ ఆడుతున్నారని సమాచారంతో దాడులు చేయగా.. పోలీసులకు పలువురు బెట్టింగ్** రాయుళ్లు పట్టుబడ్డారు. కేసు నమోదు చేశారు.
- రెండు నెలల క్రితం జిల్లా, కర్నూల్ జిల్లాకు చెందిన పేకాట రాయుళ్లు ఉండవెల్లి శివారులో రూ.లక్షలు వెచ్చించి పేకాట ఆడుతుండగా పోలీసులకు పక్కా సమాచారం అందడంతో 15 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. రూ.లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

మోసం చేస్తే చర్యలు తీసుకుంటాం

మాయమాటల ఉచ్చులో పడి మోసపోవద్దని ప్రజలకు తెలియజేస్తూనే ఉన్నాం. అయినా చాలా మంది మోసపోతున్నారు. జూదంలో మోసపోయిన వారు ఏజెంట్ల వివరాలను తెలియజేయాలి. స్థానికంగా ఎక్కడైనా పేకాట, బెట్టింగ్ లాంటివి జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వండి. వారి పేర్లు గోప్యంగా ఉంచి, స్థావరాలపై దాడులు నిర్వహిస్తాం. అమాయక ప్రజలను మోసం చేసే వారిపై నిఘా ఉంటుంది. వారిపై కఠిన చర్యలు తప్పవు.

– సత్యనారాయణ, డీఎస్పీ, గద్వాల

ఎవరూ అధైర్యపడొద్దు..



జిల్లా కేంద్రంలో భరోసా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు

- సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొందాం
- భరోసా కేంద్రం ప్రారంభోత్సవంలో కలెక్టర్ సంతోష్

గద్వాల క్రైం: మహిళలు, విద్యార్థినులు అధైర్యపడొద్దని.. గృహ హింస, మానసిక వేధింపులు వంటి సమస్యలకు కుంగిపోవద్దని.. భరోసా కేంద్రం ద్వారా రక్షణ, న్యాయం అందేలా కృషి చేయనున్నట్లు కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నూతన భరోసా సెంటర్ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. అక్రమ రవాణా, యాసిడ్ దాడులు, కుల వివక్షత తదితర సమస్యలు ఎదుర్కొంటున్న బాధిత మహిళలకు అండగా నిలిచేందుకు పోలీసు శాఖ భరోసా సెంటర్‌లను ఏర్పాటు చేసిందన్నారు. భరోసా సెంటర్‌కు వచ్చే ప్రతి కేసును అనుభవజ్ఞులైన సిబ్బంది, వాస్తవిక విచారణ, స్థానిక పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకుల సహాయంతో పాటు లీగల్, మెడికల్, సైకాలజిస్టు నిపుణుల ద్వారా చేయూత కల్పిస్తామన్నారు. బాధితలకు న్యాయంతోపాటు పునరావాసం కల్పించి వారిలో ఆత్మస్థైర్యం నింపుతారన్నారు. కేసుకు అవసరమైన సాక్ష్యాలను కోర్టుకు చేరేవరకు ఫాలోఅప్ చేస్తారన్నారు. ఉద్యోగ, స్వయం ఉపాధి కోసం బ్యాంకుల నుంచి రుణాల మంజూరుకు కృషి చేస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 195 కేసులు నమోదు కాగా అందులో 158 పోక్సో కేసులు ఉన్నాయన్నారు. బాధిత మహిళలకు రూ.35లక్షల వరకు నష్టపరిహారం అందేలా కృషి చేశారన్నారు. శాశ్వత భవనం కోసం ఓ ప్రైవేటు సంస్థ రూ.2.10 కోట్ల నిధులతో నూతన భవనం అందుబాటులోకి వచ్చిందన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన, పూజ కార్యక్రమాలు చేపట్టారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఏఎస్పీ గుణశేఖర్, డీఎస్పీ సత్యనారయణ, పలు స్వంచ్ఛంద సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగా సమగ్ర సర్వే

గద్వాల/ఎర్రవల్లి: జిల్లాలో కొనసాగుతున్న సమగ్ర సర్వే ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాలులో అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లకు సంబంధించి సర్వే ప్రక్రియ పూర్తయిందని అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు నిర్దేశించిన లక్ష్యం మేరకు సర్వేను పూర్తి చేయాలన్నారు. రోజువారి సర్వే వివరాలను సాయంత్రం అప్‌డేట్ చేయాలన్నారు. ఏదైన సమస్య తలెత్తితే వెంటనే సంబంధిత మండల తహసీల్దార్ క్షేత్రస్థాయిలో వెళ్లి సమస్య పరిష్కరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, ఎస్‌డీసీ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు పాల్గొన్నారు.

వరి కొనుగోలు ప్రక్రియ వేగవంతం

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఎర్రవల్లి మండలంలోని తిమ్మాపురంలో ఐకేపీ ఆధ్వర్యాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి కేంద్రం వద్ద ఆరబోసిన ధాన్యాన్ని, తేమ శాతాన్ని పరిశీలించారు. ధాన్యాన్ని కొనుగోలు చేసేటప్పుడు తేమ శాతాన్ని తనిఖీ చేయడంతో పాటు తాలు, మట్టి పెల్లలు లేకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్యాడీ క్లీనర్, గన్ని బ్యాగులు, టార్పాలిన్లు తప్పకుండా అందుబాటులో ఉంచాలని అన్నారు. తూకం వేసిన ధాన్యం సంచులను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. అధికారులు స్వామి కుమార్,విమల, నర్సింహులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



ఐడీవోసీ ఎదుట ధర్నా చేపడుతున్న సీఐటీయూ నాయకులు, వీఓఏలు

గద్వాల అర్బన్: వీఓఏల సమస్యలను పరిష్కరించాలని సిఐటియూ జిల్లా కార్యదర్శి వీవీ నర్సింహ్మ, వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాం అంజి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ఐడీవోసీ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నర్సింగరావుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పని చేస్తున్న వీఓఏలకు ప్రభుత్వం గ్రామ సంఘాలకు శ్రీనిధి ఇన్సెంటివ్ ఇవ్వాలని, కనీస వేతనం రూ.20వేలు చెల్లించాలని, ప్రమాదబీమా, ఆరోగ్య బీమా, ఐడీకార్డులు ఇవ్వాలని, అర్హులైన వీఓఏలకు పదోన్నతులు కల్పించాలని, ప్రతి గ్రామ సంఘానికి ల్యాప్‌టాప్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు లక్ష్మన్న, జయన్న, చంద్రాములు, కృష్ణారావు, సరస్వతి, తులసీ, భాగ్యమ్మ, కవిత తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



బీచుపల్లి పదో బెటాలియన్‌లో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా జడ్జి గంటా కవిత

ఎర్రవల్లి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా జడ్జి గంటా కవిత అన్నారు. మంగళవారం మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో శిక్షణ పొందుతున్న పోలీస్ సిబ్బందికి చట్టాలపై అవగాహన కల్పించగా..ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి హాజరై శిక్షణ పోలీస్ సిబ్బందికి వివిద చట్టాలపై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న పోలీస్ సిబ్బంది భవిష్యత్తులో నిర్వహించబోయే విధులు, వాటికి సంబంధించిన చట్టాలపై అవగాహన తప్పనిసరి అని, ప్రతి ఉద్యోగి చట్టాలకు అనుగుణంగా మెలగాలని సూచించారు. ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు విధి నిర్వహణలో పోలీసులు చట్టాలకు లోబడి ఉండాలని, ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో ఎలాంటి అవినీతికి పాల్పడవద్దని, ఎవరిపై ఎలాంటి బేదాభిప్రాయాలు చూపరాదని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కమాండెంట్ సాంబయ్య, అసిస్టెంట్ కమాండెంట్‌లు రఘునాథ్ చౌహాన్, నరేందర్‌రెడ్డి, పటాలం అధికారులు, శిక్షణ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా..

ఎన్‌హెచ్-167కే పనులు ముమ్మరం

- నిర్ణీత గడువులోగా బైపాస్ నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు
- చివరి దశకు మొదటి ప్యాకేజీ పనులు
- కృష్ణానదిపై ఐకానిక్ వంతెనకు ఈ నెల 29న టెండర్ల ఓపెన్
- చౌటబెట్లకు వెళ్లే దారిలో చౌరస్తా ఏర్పాటుపై స్పష్టత కరువు



కొల్లాపూర్ సమీపంలో చేపట్టిన జాతీయ రహదారి నిర్మాణం



బైపాస్ నిర్మాణ పనులు

కొల్లాపూర్: కల్వకుర్తి నుంచి నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ మీదుగా నంద్యాల వరకు చేపట్టిన జాతీయ రహదారి–167కే నిర్మాణ పనులు వడివడిగా సాగుతున్నాయి. రహదారి నిర్మాణంలో భాగంగా చేపట్టిన బైపాస్ పనులు ఊపందుకున్నాయి. నిర్ణీత గడువులోగా ఆయా పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో సంబంధిత అధికారులు ముందుకు సాగుతున్నారు. అలాగే మల్లేశ్వరం- సంగమేశ్వరం ప్రాంతాల మధ్య కృష్ణానదిపై నిర్మించబోయే ఐకానిక్ సస్పెన్సివ్ కేబుల్ బ్రిడ్జి పనులకు సంబంధించిన టెండర్లు కూడా ఈనెలాఖరులో ఓపెన్ కానున్నాయి.

రూ.436.91 కోట్ల వ్యయంతో..

భారత్‌మాల పథకంలో భాగంగా కల్వకుర్తి నుంచి ఏపీలోని నంద్యాల వరకు జాతీయ రహదారి–167కే నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. మొదటి ప్యాకేజీలో భాగంగా రూ.436.91 కోట్ల వ్యయంతో కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 85 కి.మీ., మేరకు రహదారి నిర్మాణం చేపట్టారు. కల్వకుర్తి నుంచి తాడూరు వరకు, నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్ వరకు రహదారి పనులు చివరి దశకు చేరుకున్నాయి. కల్వకుర్తి, కొల్లాపూర్ సమీపంలో నిర్మిస్తున్న బైపాస్ రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రధాన చౌరస్తాల్లో ఫ్లెఓవర్ నిర్మాణాలు చేపట్టారు. మేడిపూర్ సమీపంలోని డిండి వాగుపై వంతెన నిర్మాణం 50 శాతం పూర్తయింది. కొన్నిచోట్ల కల్వర్టుల నిర్మాణాలు సాగుతున్నాయి. గ్రామాల్లో జాతీయ రహదారికి ఇరువైపులా ఇనుప కంచెలు.. మరికొన్ని చోట్ల డివైడర్లు ఏర్పాటు చేశారు.

గత సెప్టెంబర్‌లో టెండర్లు

ఎన్‌హెచ్–167కేలో భాగంగా మల్లేశ్వరం నుంచి సంగమేశ్వరం వరకు కృష్ణానదిపై 87.360 కి.మీ., నుంచి 88.437 కి.మీ., వరకు ఐకానిక్ సస్పెన్సివ్ కేబుల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం గత సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించగా.. అంతర్జాతీయ కంపెనీలు ముందుకు వచ్చాయి. అయితే ఆయా కంపెనీల అర్హతలను పరిశీలించే ప్రక్రియను నేషనల్ హైవే అథారిటీ అధికారులు చేపట్టారు. ఈ నెల 29న టెండర్ ఓపెన్ చేయనున్నట్లు అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చారు.

భూసేకరణకు సమాయత్తం..

కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు బైపాస్ రహదారులు నిర్మించే ప్రాంతాల్లో భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లింపులు చేపట్టారు. కల్వకుర్తి, కొల్లాపూర్‌లో పరిహారం చెల్లింపులు దాదాపుగా పూర్తయ్యాయి. నాగర్‌కర్నూల్‌లో మాత్రం ఇంకా చెల్లింపులు జరగాల్సి ఉంది. మొదటి ప్యాకేజీలో భాగంగా కొల్లాపూర్ సమీపం వరకు జాతీయ రహదారి నిర్మిస్తున్నారు. రెండో ప్యాకేజీలో సోమశిల రోడ్డు నుంచి మల్లేశ్వరం వరకు రహదారి నిర్మించనున్నారు. అందుకు అవసరమైన భూసేకరణ, పరిహారం చెల్లింపుల ప్రక్రియ పూర్తిచేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. సోమశిల వద్ద ఐకానిక్ బ్రిడ్జి టెండర్లు ఓపెన్ అయిన తర్వాత ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. అటవీ భూముల్లో రోడ్డు నిర్మాణం కోసం అవసరమైన అనుమతులకు చర్యలు చేపట్టారు.

చౌటబెట్ల చౌరస్తా కోసం..

కొల్లాపూర్ నుంచి చౌటబెట్లకు వెళ్లే దారిలో చౌరస్తా ఏర్పాటు చేయాలని స్థానిక నేతలు కోరుతున్నారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడారు. చౌటబెట్లకు వెళ్లే దారిలో అండర్‌పాస్ బ్రిడ్జి కాకుండా చౌరస్తా ఏర్పాటు చేయాలని.. లేదంటే ఫ్లెఓవర్ నిర్మించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కూడా సంబంధిత అధికారులతో మాట్లాడారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు చౌటబెట్ల దారిలో చౌరస్తా ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ అంశంపై త్వరలోనే స్పష్టత రానుంది.

మార్కింగ్ చేశారు..

కొల్లాపూర్ సమీపంలో చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి పరిహారం చెల్లింపుల ప్రక్రియను పూర్తిచేశాం. సాంకేతిక కారణాల వల్ల కొందరికి పరిహారం చెల్లింపులో జాప్యం జరిగింది. సోమశిల రోడ్డు నుంచి మల్లేశ్వరం వరకు చేపట్టే జాతీయ రహదారి నిర్మాణ ప్రాంతంలో భూసేకరణ కోసం గతంలో మార్కింగ్ చేశారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే భూసేకరణ ప్రక్రియ చేపడతాం.

– భన్సీలాల్, ఆర్డీఓ, కొల్లాపూర్

అధికారులపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి



నల్ల బ్యాడ్జీలు ధరించి ఏఓ వీరభద్రప్పకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

గద్వాల: వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై దాడికి పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించాలని జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులపైనే భౌతిక దాడులకు పాల్పడితే మాలాంటి అధికారులకు భద్రత ఎలా ఉంటుందని దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించి ఉద్యోగులకు కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ వీరభద్రప్పకు అందజేశారు. కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది, ఇరిగేషన్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


దూపం పెద్దయ్య (ఫైల్)

పెబ్బేరు రూరల్: ఇంట్లో ఉరేసుకొని అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చెలిమిల్ల కిష్టారెడ్డిపేటలో చోటుచేసుకుంది. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల ప్రకారం.. పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని చెలిమిల్ల కిష్టారెడ్డిపేటలో దూపం పెద్దయ్య(50) కూతురు వివాహంపై కుటుంబంలో కొంత కాలంగా కలహాలు ఉన్నాయి. ఈ విషయంపై సోమవారం రాత్రి మరోసారి గొడవ జరిగింది. దీంతో అందరు భోజనం చేసిన తర్వాత నిద్రిస్తున్న సమయంలో సోమవారం అర్ధరాత్రి ఇంట్లోని పైకప్పు రాడ్‌కు తన అద్దపంచతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి మార్చురీకి తరలించారు. పెద్దయ్య తమ్ముడు దూపం సర్వేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాచిపెట్టి పెళ్లి చేసుకున్నాడు..

- న్యాయం కోసం బాధితురాలి ఫిర్యాదు


మొదటి భార్యతో తాహేర్ (ఫైల్)

శాంతినగర్ : తన భర్తకు ముందుగానే వివాహమైన విషయం దాచిపెట్టి తనను పెళ్లి చేసుకున్నాడంటూ ఓ వివాహిత మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. శాంతినగర్‌కు చెందిన షేక్ నౌషీన్‌కు వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలానికి చెందిన షేక్ తాహేర్‌కు 2022 మార్చి 27న వివాహం జరిపించారు. పెళ్లైనప్పటి నుంచి అత్త, ఆడపడచులు, భర్త వేధించేవారు. ఇదే విషయాన్ని అప్పట్లో శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో నౌషన్ ఫిర్యాదు చేసింది. 2017లో సన్నిస్మిత్ అనే ఆమెను పెళ్లి చేసుకున్న విషయాన్ని తాహేర్ దాచిపెట్టాడు. తనను 2022లో పెళ్లి చేసుకున్న విషయం తెలిసిన సన్నిస్మిత్ బంధువులు ఇటీవలే తనను కొట్టారు. తాను పుట్టింటికి వచ్చేసినట్లు నౌషన్ పేర్కొన్నారు. భర్త, అతడి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది.

ఏడు పాములు పట్టివేత



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 7.30గంటల వ్యవధిలో ఏడు పాములు పట్టుకున్నట్లు సర్పరక్షకుడు డా. సదాశివయ్య తెలిపారు. శిక్షణ పొందిన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు నవనీత్, రవీంద్రనాయక్‌లతోపాటు తాను పాములను పట్టుకున్నామన్నారు. వాటిలో ఒకటి నాగుపాము, ఐదు నీరుకట్టలు, ఒకటి కూడుపాము ఉన్నాయన్నారు. ఇళ్లల్లోకి పాములు వస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇంట్లో చోరీ

ఊర్కొండ: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు పడి చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మాధారం గ్రామానికి చెందిన బోయ కుర్మయ్య తన తండ్రి దశదిన కర్మ ముగిసిన తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి ఊర్కొండపేట అభయాంజనేయ ఆలయానికి నిద్ర చేసేందుకు వెళ్లారు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రెండుతులాల బంగారం, ఇరవై తులాల వెండి వస్తువులు చోరీ చేశారు. దీన్ని గుర్తించిన ఇంటి పక్కల వారు కుర్మయ్యకు సమాచారం అందించారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ వీరబాబు సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు 4వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ప్రాజెక్టు నుంచి మొత్తం 3,856 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.234 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

రామన్‌పాడుకు..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళ వారం నాటికి పూర్తి స్థాయి నీటిమట్టం 1,020అడుగులకు చేరింది. జూరాల ఎడమకాల ద్వారా 1,030 క్యూసెక్కులు, సమాంతర కాలువ ద్వారా 1000క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

రసవత్తరంగా జోనల్ క్రీడలు


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మదనాపూర్-దామరగిద్ద జట్లు

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న 10వ జోనల్‌స్థాయి (బాలుర) క్రీడా పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 13 గురుకులాల క్రీడాకారులు స్పోర్ట్స్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటాపోటీగా తలపడుతున్నారు. రెండో రోజు మంగళవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో పలువురు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. అండర్-14 విభాగం లాంగ్ జంప్‌లో ఎం.ప్రవీణ్ (అచ్చంపేట) మొదటి, ఎస్.రాంచరణ్ (జేపీ నగర్) ద్వితీయ, వినయ్‌కుమార్ (అచ్చంపేట) తృతీయ స్థానాల్లో నిలిచారు. అండర్-14 చెస్ పోటీల్లో విన్నర్‌గా హేమచరణ్ (లింగాల), రన్నర్‌గా శ్రీశాంత్ (జేపీ నగర్) విజయం సాధించారు. అండర్-17 చెస్‌లో మొదటి స్థానంలో సీహెచ్ నవీన్ (దామరగిద్ద), రెండవ స్థానంలో శరత్‌చంద్ర (గద్వాల), అండర్-19 చెస్‌లో విన్నర్‌గా జగదీష్ (లింగాల), రన్నర్‌గా నితీష్ (అయిజ), అండర్-14 క్యారమ్స్‌లో విన్నర్‌గా డి.భరత్-పాలు (జేపీ నగర్), రన్నర్‌గా అభినయ్-సిద్దార్థ (పెద్దకొత్తపల్లి) విజయం సాధించారు. అండర్-17 విభాగం 5కే రన్‌లో మొదటి స్థానంలో మధునాయక్ (మదనాపూర్), రెండవ స్థానంలో సిద్దార్థ (జేపీ నగర్), మూడవ స్థానంలో శివకుమార్ (దామరగిద్ద) నిలిచారు. అండర్-19 విభాగం 5కే రన్‌లో సి.అనిల్ (బిజినేపల్లి) మొదటి, శివకుమార్ (లింగాల) ద్వితీయ, సంతోష్ (లింగాల) తృతీయ స్థానంలో నిలిచారు. అండర్-17 బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్‌లో ఇటిక్యాల మొదటి స్థానం, లింగాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. వంద మీటర్ల పరుగు పందెంలో భానుప్రసాద్ (లింగాల) మొదటి, గణేష్(లింగాల) ద్వితీయ, ప్రశాంత్ (బాలానగర్) తృతీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ బాలస్వామి, పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

జడ్చర్ల: మండలంలోని చిట్టిబోయిన్‌పల్లి సమీపంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్, జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో 10వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిధిలోని ఎనిమిది సోషల్ వెల్ఫేర్ స్కూల్స్, జూనియర్ కళాశాలలకు చెందిన 680 మంది బాలికలు క్రీడలలో పాల్గొన్నారు. అండర్- 14, 17, 19 విభాగాలకు సంబంధించి అథ్లెటిక్స్, లాంగ్‌జంప్, హైజంప్, టెన్నికాయిట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, చెస్, క్యారమ్స్ పోటీల్లో బాలికలు పాల్గొన్నారు. మరో రెండు రోజుల పాటు క్రీడా పోటీలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనిత, జిల్లా కోఆర్డినేటర్ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.


నారాయణపేట- మరికల్ జట్ల మధ్య కొనసాగుతున్న కబడ్డీ

జాతీయ గోగేమ్ పోటీలకు రాష్ట్ర క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరిగే జాతీయ స్థాయి 2వ సీనియర్, 1వ సబ్ జూనియర్, జూనియర్ (సింగిల్, టీం ఈవెంట్) గోగేమ్ టోర్నీలో పాల్గొనే రాష్ట్ర క్రీడాకారులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లాకేంద్రంలో క్రీడాకారులను కౌన్సిలర్ స్వప్న అభినందించారు. జాతీయస్థాయి గోగేమ్‌లో ప్రతిభచాటి పతకాలు సాధించా లని కోరారు. కార్యక్రమంలో గోగేమ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సీనియర్ ఉపాధ్యక్షుడు మహ్మద్ షకీల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి గులాం అఫ్రోజ్, అర్జునయ్య, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల వీరే..

సబ్ జూనియర్ విభాగం సింగిల్‌లో చేతన్ చంద్ర, కృష్ణ, సబ్ జూనియర్ టీం ఈవెంట్‌లో రయ్యాన్ నజమ్, సబావత్ వర్షిత్, శ్రీదత్త, బషీర్, పి.రాజేష్, జూనియర్ విభాగం సింగిల్‌లో బషీరుద్దీన్, కె.హారిక, సీనియర్ విభాగం సింగిల్‌లో మహ్మద్ రయ్యాన్ నజమ్ పోటీపడనున్నారు.



హోరాహోరీగా జోనల్ స్థాయి పోటీలు


వాలీబాల్‌లో వెల్దండపై గెలిచి సెమీస్ చేరిన గోపాల్‌పేట జట్టు

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలలో సోమవారం ప్రారంభమైన జోనల్ స్థాయి ఆటల పోటీలు మంగళవారం రెండోరోజు కొనసాగాయి. రెండోరోజు అండర్- 17 కబడ్డీ పోటీల్లో మన్ననూర్, తెలకపల్లి పోటీపడగా తెలకపల్లి విజయం సాధించింది. అండర్- 14 కబడ్డీలో అలంపూర్, పెద్దమందడి పోటీపడగా అలంపూర్ విజయం సాధించింది. అండర్- 19 కబడ్డీలో గోపాల్‌పేట, పెద్దమందడి పోటీపడగా గోపాల్‌పేట విజయం గెలుపొందింది. అలాగే అండర్- 17 వాలీబాల్ పోటీల్లో గట్టు, వెల్దండ పోటీపడగా గట్టు, అండర్- 19 వాలీబాల్ పోటీలో మానవపాడు, మన్ననూరు జట్లు పోటీపడగా మానవపాడు విజయం సాధించింది. అథ్లెటిక్స్ అండర్- 14 డిస్కస్‌త్రోలో తెలకపల్లికి చెందిన ప్రేమలత మొదటిస్థానం, మానవపాడుకు చెందిన సుప్రియ రెండోస్థానం, కొల్లాపూర్‌కు చెందిన నిహారిక సాయి మూడోస్థానంలో నిలిచారు. అండర్- 19 షాట్‌పుట్‌లో పెద్దమందడికి చెందిన నందిని, మన్ననూరుకు చెందిన స్పందన, గట్టుకు చెందిన జయశాలిని మూడోస్థానంలో నిలిచారు. క్రీడాపోటీలను జోనల్ ఇన్‌చార్జ్ భాస్కర్‌గౌడ్, ప్రిన్సిపల్ ఆరోగ్య పర్యవేక్షించారు.


కబడ్డీ పోటీలో తలపడుతున్న మన్ననూర్, తెలకపల్లి జట్లు

వివాహేతర సంబంధానికి అడ్డుగా మారాడని..


హత్యకు సంబంధించి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య

- నిందితుల అరెస్ట్ – రిమాండ్‌కు తరలింపు
- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం: వివాహేతర సంబంధానికి అడ్డుగా మారాడని ఓ భార్యను ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు. ఈనెల 7న వెల్దండ మండలంలో జరిగిన హత్యకేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో వెల్లడించారు. వెల్దండ మండలంలోని ఎంజీకాలనీతండాకు చెందిన రాజు, హిమబిందు తొమ్మిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఏడాది కాలంగా హిమబిందు మహేశ్వరం మండలం క్లొంచెరువుతండాకు చెందిన చంటితో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. ఇదే క్రమంలో తమ అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హతమార్చాలని నిర్ణయించుకుంది. ఆమె ప్రియుడు చంటి, అతడి స్నేహితుడు రాకేష్ సహాయంతో ఈనెల 7వ తేదీ అర్ధరాత్రి ఎంజీకాలనీతండాలో వ్యవసాయపొలంలో నిద్రిస్తున్న రాజును సుత్తితో తలపై మోది హతమార్చారు. మృతదేహాన్ని ముగ్గురు కలిసి కొంతదూరంలో పడవేశారు. తన భర్త కనబడటంలేదని మృతుడి అన్నలాలుకు హిమబిందు ఫోన్ చేసింది. దీంతో కుటుంబసభ్యులు ఈనెల 8న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని గుర్తి కేసు దర్యాప్తు ప్రారంభించారు. రాజును హతమార్చిన నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరం అంగికరించారు.

న్యాక్ బృందం పరిశీలనపై సమీక్ష


మాట్లాడుతున్న వీసీ జీఎన్ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీని త్వరలో న్యాక్ పీర్ టీం సందర్శించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళవారం అడ్మినిస్ట్రేషన్ భవనంలో వివిధ డిపార్ట్‌మెంట్ల హెచ్‌ఓడీలతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లకు సంబంధించి అన్ని యాక్టివిటీస్ డేటాను న్యాక్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారో దానిని పూర్తిగా డాక్యుమెంట్స్ రూపంలో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. క్రైటీరియా కోఆర్డినేటర్స్ డాక్యుమెంట్స్‌కు సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ఈసారి కచ్చితంగా న్యాక్ గ్రేడింగ్ పెంచేందుకు ప్రతిఒక్కరు కృషిచేయాలన్నారు. గ్రేడింగ్ పెరిగితే నిధులు కూడా పెరుగుతాయన్న విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. సమావేశంలో రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్ నూర్జహాన్, కంట్రోలర్ రాజ్‌కుమార్, అంకం భాస్కర్, చంద్రకిరణ్, వెంకట్‌రెడ్డి, బషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.


హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది


కురుమూర్తి స్వామిని దర్శించుకున్న భక్తులు

కురుమూర్తి గిరుల కిటకిట

- వైభవంగా కొనసాగుతున్న జాతర.. తరలివస్తున్న భక్తజనం

చిన్నచింతకుంట:పాలమూరు మట్టిబిడ్డల ఇంటి ఇలవేల్పు కురుమూర్తిస్వామి జాతర వైభవంగా కొనసాగుతుంది. ఉత్సవాలకు రాష్ట్రంతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులతో కురుమూర్తి గిరులు కిటకిటలాడుతున్నాయి. మంగళవారం ఉదయం పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన భక్తులు తడిగుడ్డలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని ముడుపులు కట్టారు. అలివేలు మంగమ్మ, ఆంజనేయ స్వామి, చెన్నకేశవస్వాముల ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది.

హుండీ ఆదాయం రూ.25.54 లక్షలు..

బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలను పురస్కరించుకొని కురుమూర్తిస్వామికి భక్తులు కానుకలుగా సమర్పించిన హుండీని మొదటిసారిగా ఆలయ అధికారులు మంగళవారం లెక్కించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.25,54,805 వచ్చినట్లు ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భాస్కరచారి, కమలాకర్, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి పాదుకల వద్ద గండదీపం మోస్తున్న మహిళ

‘అలుగు’ చర్మానికి విపరీతమైన డిమాండ్


అలుగు, అలుగు నిందితులతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది

- డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి
- నిందితులకు రిమాండ్

మన్ననూర్: ‘అలుగు’ చర్మానికి అంతర్జాతీయ మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉందని డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వనమాళికా ప్రాంగణంలో అలుగులను స్మగ్లింగ్ చేస్తున్న నిందితులను విలేకర్ల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ మాట్లాడారు. శీలం బుడ్డయ్య నేతృత్వంలో చుక్కల గుండం ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం అలుగును పట్టుకున్నారు. మూడు రోజులుగా దాన్ని భద్రపరిచారు. మద్దిమడుగు గ్రామానికి చెందిన మండ్లీ వీరయ్య, చిగుర్ల అంజయ్య, శీలం ఈదయ్యలతో పాటు మరి కొంతమంది సహాయంతో హాజీపూర్ గ్రామం వద్ద అలుగును విక్రయిచేందుకు బేరం ఆడుతున్నారు. అటవీశాఖ అధికారులు సోమవారం ఉదయం ఇరువర్గాలను పట్టుకున్నారు. విచారణ జరిపి 11 మందిని రిమాండ్ తరలిస్తుండగా వారిలో చిగుర్ల అంజయ, రమేష్ పరారైనట్లు ఆయన తెలిపారు. గత ఏడాది కూడా ఒక అలుగును ఇక్కడి నుంచి తరలించి రంగారెడ్డి జిల్లాలో ఇదే స్మగ్లింగ్ ముఠా సభ్యులు విక్రయించినట్లు విచారణ వెల్లడైంది. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ రామ్మూర్తి, ఎఫ్‌ఆర్‌ఓ దేవజ, డీఆర్‌ఓలు రవికుమార్, వాణి, మన్ననూర్, అమ్రాబాద్, మద్దిమడుగు, దోమలపెంట రేంజ్ పరిధిలోని అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో వెళ్తున్న వాహనం బోల్తా

- ముగ్గురికి తీవ్రగాయాలు, 40మందికి స్వల్పగాయాలు


కనిమెట్ట వద్ద ఎన్‌హెచ్44పై బోల్తా పడిన బొలెరో వాహనం

కొత్తకోట రూరల్: పరిమితికి మించి కూలీలతో వెళ్తూ బొలెరో వాహనం బోల్తాపడింది. ఈ సంఘటన మంగళవారం ఉదయం కొత్తకోట మండలం కనిమెట్ట వద్ద జాతీయరహదారి44పై జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా 40 మందికి పైగా కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భూత్కూర్‌కు చెందిన 40మందికి పైగా, కొత్తకోటకు చెందిన 6మంది మహిళా కూలీలు బొలెరో వాహనంలో కొకుంట్ల మండలం ఎంకంపల్లికి పత్తి ఏరేందుకు బయలుదేరారు. డ్రైవర్ ఎస్.ఆంజనేయులు వాహనంలో పరిమితికి మించి జనాలను ఎక్కించుకున్నాడు. కనిమెట్ట సమీపంలో వాహనం అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో కూలీలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయారు. గాయపడిన వారి అరుపులు కేకలు మిన్నంటాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బొలెరో రోడ్డుకు అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను వివిధ ఆసుపత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన కళ్యాణి, జయమ్మను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు, రేణుకను కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. సారంభీ, పర్వీన్, నర్సమ్మ, శైలజ, తిరుపతమ్మ, చిట్టెమ్మ, పుష్పను మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్‌కు మరికొందరిని కొత్తకోట, వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బోల్తాపడిన వాహనాన్ని పక్కకు తీసి ట్రాఫి క్‌ను క్లియర్ చేశారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు డ్రైవర్ ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి..

జడ్చర్ల: పత్తి తీసేందుకు కూలీలను తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. మంగళవారం మండలంలోని పెద్దఆదిరాల గ్రామానికి చెందిన కూలీలను ఓ రైతు పొలానికి తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో 16మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా మిగతావారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం ఆటోల్లో జడ్చర్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. లలితమ్మ, శివలీల, సుజాతకు తీవ్రగాయాలు కాగా అనిత, జంగమ్మ, కృష్ణవేణి, ఊర్మిళ, ఎల్లమ్మ, కృష్ణమ్మ, సుజాత స్వల్పంగా గాయపడ్డారు. బాధితులను జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు రఘుపతిరెడ్డి, రాంలింగారెడ్డి, సురేష్, శంకర్‌నాయక్ పరామర్శించారు.


గాయపడ్డ కూలీలను పరామర్శిస్తున్న జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య

బీసీలు ఐకమత్యంతో పోరాడాలి

- బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ టి.చిరంజీవులు


సదస్సులో మాట్లాడుతున్న టి.చిరంజీవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: బీసీలు చైతన్యవంతులై ఐకమత్యంతో పోరాడి అధికారాన్ని సాధించుకోవాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ టి.చిరంజీవులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం బీసీ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు రాజ్యాధికారం దోహదపడుతుందన్నారు. బీసీల్లో నాయకత్వ లక్షణాలున్న లీడర్లు పుట్టుకొస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీసీ భావజాల వ్యాప్తిని సమాజంలోకి తీసుకెళ్లాలన్నారు. రవికుమార్ ప్రజాప్రతి మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ ఉద్యోగాల్లో బీసీలు చాలా అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ బీసీలు ప్రశ్నిస్తే మాట్లాడితే అవి తిట్లుగా భావిస్తున్నారన్నారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్‌సాగర్, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గన్న, స్వాతంత్ర సమరయోధులు వకీల్ భీమయ్య, సీనియర్ న్యాయవాది బెక్కం జనార్దన్, ఆయా కుల సంఘాల ప్రతినిధులు సారంగి లక్ష్మీకాంత్, మహేందర్, ఆశన్న ముదిరాజ్, లక్ష్మణ్‌గౌడ్, రమేష్‌గౌడ్, శివాని, బాలమణి పాల్గొన్నారు.